RNI - TELTEL/2023/87644
# నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక

సంచిక : 33 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | బుధవారం | 10-06-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00

**నీలగిరి నిత్యపద్యం**
ఆటవెలది

చీకటి సమయాన యేకమ్ముగా రాత్రి
తిరుగుటెల్లగాదు ధీరుడనగ
చిక్కులెన్నియున్న చిరునవ్వు చిందించి
నడుచునట్టి నరుడు నాగరికుడు

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



# పీఓకేలో రక్తపాతం

**నిరసనకారులపై పాక్ బలగాల కాల్పులు..**

- 30 మంది మృతి..
  200 మందికి పైగా గాయాలు
- ముజఫరాబాద్, రావలకోట్‌లో ఉద్రిక్త పరిస్థితులు
- హక్కుల కోసం పోరాటం..
  అణచివేతకు దిగిన పాక్ బలగాలు

2

పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ ( లో తీవ్ర ఉద్రిక్తతలు చెలరేగాయి. రేషన్ కోటా తగ్గింపు, ధరల పెరుగుదలపై ఆందోళనకారులు రోడ్లపైకి దిగి భద్రతా బలగాలపై దాడులు చేయడంతో ఘర్షణలు హింసాత్మకంగా మారాయి. ఈ ఘటనల్లో సుమారు 30 మంది మృతి చెందగా, 200 మందికి పైగా గాయపడినట్లు సమాచారం. పరిస్థితి ర్లటవల్‌కోట్, బింబర్, ముజఫరాబాద్ ప్రాంతాల్లో అత్యంత ఉద్రిక్తంగా మారింది.



## ప్రాజెక్టులకు అడ్డుపడ్డానని
# నిరూపిస్తావా

- నిరూపిస్తే వెంటనే రాజీనామా చేస్తా
- అప్పులు తెచ్చి సోకులు చేస్తున్నారు
- మంత్రులతోపాటు
  అందరూ భూ దోపిడీ చేస్తున్నారు
- సిఎం రేవంత్‌కు కిషన్ రెడ్డి సవాల్

**న్యూఢిల్లీ జూన్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్రంలో ప్రాజెక్టులను తాను అడ్డుకుంటున్నానని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం సాధించినా తెలంగాణ ప్రజల బతుకులు మాత్రం మారలేదంటూ కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు తెచ్చి సోకులు చేస్తున్నారంటూ గత బీఆర్ఎస్, ప్రస్తుత రేవంత్ సర్కార్ తీరును ఆయన ఎండగట్టారు. హైదరాబాద్‌లో భూములు మిగిలే పరిస్థితి లేదన్నారు. మంత్రులతోపాటు అందరూ భూ దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం కుదేలయ్యిందని చెప్పారు. ఉద్యోగులకు వేతనాలు ఇచ్చే పరిస్థితి ప్రభుత్వానికి లేదన్నారు.సీఎం రేవంత్

-మిగతా 2 లో

## ఇందిరమ్మ రాజ్యంలోనే మహిళలకు
# పెద్దపీట

**మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ**

ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు పెద్దపీట వేస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కీలక పథకాలను అమలు చేస్తూ, 553 ఆర్టీసీ బస్సు సర్వీసులను మహిళలకు ఉచిత ప్రయాణానికి అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు.
హైదరాబాద్ ప్రజా ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడిన సీఎం, మహిళా సాధికారతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని, విద్య, రవాణా, సంక్షేమ రంగాల్లో భారీ పెట్టుబడులు పెట్టి సమగ్ర అభివృద్ధిని సాధిస్తామని ఆయన వెల్లడించారు.

- మహిళా సాధికారతకు మరో అడుగు
- వారిని కోటీశ్వరులను చేసే పనిలో వెనకడుగు లేదు
- మహిళల స్ఫూర్తితోనే తమ ప్రజాపాలన సాగుతోంది
- వారి దెబ్బకే కొందరు ఫమ్‌హౌజ్‌కు పరిమితం అయ్యారు
- కెసిఆర్ హయాంలో మంత్రి పదవులు కూడా ఇవ్వలేదు
- బిజెపి కనీసం మహిళకు అధ్యక్ష పదవి ఇవ్వలేదు
- పరేడ్ గ్రౌండ్స్ సభలో సిఎం రేవంత్ రెడ్డి

2






## దేశ ద్రోహులకు
# స్థానం లేదు

- భారత్ ధర్మసత్రం కాదు
- లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్
  పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్

2

# విజయన్ కుమార్తెకు ఈడీ సమన్లు



2



## ధాన్యం కొనుగోళ్లపై
# కేంద్రం తిరకాసు

- మరోమారు కేంద్రానికి లేఖ రాస్తా
- 8 లక్షల మేట్రిక్ టన్నుల మొక్క జొన్న కొనుగోలు
- హమాలీల కొరత కూడా సేకరణలో అడ్డంకి
- ధాన్యం సేకరణలో ప్రతిపక్షాల విమర్శలు అర్థరహితం
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బాధ్యతారహి విమర్శలు
- మేడిగడ్డలో నీళ్లు నింపితే
  కొట్టకుపోతాయన్న ఎన్‌డీఎస్ఏ
- మీడియా సమావేంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్ జూన్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్రంలోని వడ్లకు ఇతర రాష్ట్రాల్లో డిమాండ్ లేదని పౌరసరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. అందుకే ఈ వడ్లను కేంద్రం కొనుగోలు చేయడానికి సుముఖంగా లేదన్నారు. మంగళవారం హైదరాబాద్ సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్లతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో పండించిన 75 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు చేయాలని మరోసారి కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి లేఖ రాస్తానని ఆయన స్పష్టం చేశారు. ఇంకా రెండు లక్షల మెట్రిక్ టన్నుల ప్రొక్యూర్‌మెంట్ వచ్చే అవకాశం

-మిగతా 2 లో



# లక్షద్వీప్‌లో మద్యం అమ్మకాలకు గ్రీన్‌సిగ్నల్

- 1979 నాటి పాత చట్టాన్ని రద్దు చేసిన కేంద్రం
- లైసెన్స్ ఉంటేనే ఇకపై మద్యం విక్రయాలు
- విదేశీ లిక్కర్‌పై 400%, బీర్లపై 200 శాతం ఎక్సైజ్ సుంకం!
- మాల్దీవులకు పోటీగా టూరిజం హబ్
- స్థానిక సెంటిమెంట్లు దాటి కేంద్రం కీలక నిర్ణయం

2

**47 ఏండ్ల నిషేధం ఎత్తివేత..**

## నైరుతి ఆగమనంతో
# పలకరించిన తొలకరి

- హైదరాబాద్ నగరంలో ఉరుములతో భారీ వర్షం
- ఎప్పటిలాగే లోతట్టు ప్రాంతాలు జలమయం
- అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక



**హైదరాబాద్, జూన్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తొలకరి పలకరించింది. నైరుతి ప్రవేశంతో హైదరాబాద్ నగరంలో భారీ వర్షం కురిసింది. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నగరంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. నగరంలో పలు చోట్ల ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురు గాలుల తీవ్రతకు రామ్‌నగర్‌లోని వీఎస్టీ రోడ్డులో భారీ వృక్షం నేలకొరిగింది. అలాగే, హైదర్‌గూడలోనూ ఓ భారీ వృక్షం నేలకొరగడంతో ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది.

-మిగతా 2 లో

## 18 గంటలు
# పనిచేస్తున్నాం




**ధనిక రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు:**

- పేదలకు సన్నబియ్యం ఇవ్వాలని బిఆర్ఎస్ ఆలోచించలేదు
- ఇచ్చిన హామీ మేరకు ఇప్పటి వరకు 76వేల ప్రభుత్వ ఉద్యోగాల కల్పన
- తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరలకు కొంటున్న ఘనత మాదే
- జనగామ జిల్లా పర్యటనలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క

**జనగామ, జూన్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** : ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర మంత్రివర్గం 18 గంటలు పనిచేస్తుంటే.. బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఏదో ఒక అభాండం వేస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ధనిక రాష్ట్రాన్ని చేతిలో పెడితే అంతా ఖాళీ చేసిపోయారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు రాష్ట్రాన్ని దోపిడీ చేశారన్నారు. పేదలకు చెందాల్సిన సొమ్మును బీఆర్ఎస్ దోచుకుందని

-మిగతా 2 లో



## హెచ్1 బి వీసాపై
# ట్రంప్‌కు షాక్

- హెచ్1బీ ఫీజు పెంపు నిర్ణయానికి అమెరికా కోర్టులో బ్రేక్
- ట్రంప్ ప్రతిపాదించిన 85 లక్షల
  డాలర్ల ఫీజుపై న్యాయస్థానం అడ్డుకట్ట
- ఫెడరల్ కోర్టు తీర్పుతో వలస విధానానికి
  తాత్కాలిక ఉపశమనం
- 20 రాష్ట్రాల పిటిషన్లతో ట్రంప్ నిర్ణయానికి ఎదురుదెబ్బ

**వాషింగ్టన్**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు షాక్ తగిలింది. హెచ్1బీ వీసాల కోసం ట్రంప్ ప్రభుత్వం ప్రతిపాదించిన లక్ష డాలర్ల సుమారు రూ. 85 లక్షలకు పైగా భారీ ఫీజును అమెరికా ఫెడరల్ న్యాయస్థానం కొట్టేసింది. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం పూర్తిగా చట్ట విరుద్ధమని బోస్టన్‌లోని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి లియో సారొకిన్ సోమవారం తీర్పు వెలువరించారు. విదేశాల్లో ఉంటూ అమెరికా తాత్కాలిక వలస వీసా హెచ్1బీకి ఎంపికైన వారు ఈ భారీ మొత్తాన్ని చెల్లించాలని గత సెప్టెంబరులో ట్రంప్ ప్రభుత్వం నిబంధన తీసుకురాగా.. దీనిని సవాలు చేస్తూ అమెరికాలోని 20 రాష్ట్రాల అటార్నీ జనరల్స్ బోస్టన్ కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన జడ్జి, అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేకుండా అధ్యక్షుడు నేరుగా ఇలాంటి పన్నులపై నిర్ణయం తీసుకోలేరని స్పష్టం చేశారు. ఈ భారీ వసూలు పెనాల్టీ కాదని,

-మిగతా 2 లో

# పీఓకేలో రక్తపాతం

**-నిరసనకారులపై పాక్ బలగాల కాల్పులు..**
**-30 మంది మృతి.. 200 మందికి పైగా గాయాలు**
**- ముజఫరాబాద్, రావలకోట్‌లో ఉద్రిక్త పరిస్థితులు**
**- హక్కుల కోసం పోరాటం.. అణచివేతకు దిగిన పాక్ బలగాలు**



**ఇస్లామాబాద్**
పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో ని నిరసనకారులపై పాకిస్థాన్ భద్రతా దళాలు ఫైరింగ్‌కు పాల్పడ్డాయి. ఈ ఘటనలో సుమారు 30 మంది మృతిచెందగా, మరో 200 మంది గాయపడ్డారు. పాకిస్థాన్ నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేస్తున్న ఆందోళనకారులపై భద్రతా దళాలు కాల్పులు జరిపాయి. రావల్‌కోట్, బింబేర్, ముజాఫరాబాద్‌లో పరిస్థితి దారుణంఆ ఉంది. పాక్ దళాలు చాలా క్రూరంగా ఫైరింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. టియర్ గ్యాస్‌తోనూ నిరసనకారుల్ని చెదరగొట్టారు.జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ(జేఏఏసీ) అనే సంస్థ ఇచ్చిన ఆందోళన మేరకు జనం నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. ఆర్థిక, రాజకీయ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఓ ఆస్పత్రి మార్చురీ వద్ద భారీ సంఖ్యలో జేఏఏసీ కమిటీ మద్దతుదారులు చేరుకున్నారు. నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు ప్రయత్నించారు. ఆ సమయంలో గ్రూపులోని కొందరు ఆటోమెటిక్ రైఫిళ్లు, పెట్రోల్ బాంబులను వాడారు. జూలై 27వ తేదీన జరగనున్న ప్రాంతీయ ఎన్నికల్లో శరణార్థులకు 12 సీట్లు కేటాయించరాదు అని జేఏఏసీ పేర్కొన్నది

# దేశ ద్రోహులకు స్థానం లేదు


**-భారత్ ధర్మసత్రం కాదు**
**-లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**
**-ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్**



**లక్నో**
దేశ సంస్కృతి, సంప్రదాయాల పట్ల విశ్వాసం లేని వారికి భారతదేశం ఎంతమాత్రం ధర్మశాల కాదని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అన్నారు. లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. లఖ్‌నవూలో మంగళవారంనాడు జరిగిన శ్రీరామకథా మహోత్సవం ముగింపు వేడుకలో ఆయన మాట్లాడుతూ, శ్రీరాముని ఆదర్శాలు యావద్దేశాన్ని ఏకం చేస్తున్నాయని చెప్పారు. 'భారతదేశం ఎంతమాత్రం ధర్మశాల కాదు. దేశ సంస్కృతి, వారసత్వం, విలువలను గౌరవించే వాళ్లు మాత్రమే ఇక్కడ గౌరవప్రదంగా జీవించవచ్చు. భారతదేశ స్ఫూర్తి, సంప్రదాయాలను అంగీకరించని వాళ్లకి ఇక్కడ స్థానం లేదు' అని యోగి ఆదిత్యనాథ్ అన్నారు. రామాయణ కాలానికి, నవీన భారతానికి మధ్య సారూప్యాన్ని వివరిస్తూ, దుష్టశక్తులు అధికారంలో ఉన్నప్పుడల్లా రాక్షసరాజు రావణాసురిడి కాలంలో ఏవిధంగా దుష్టశిక్షణ జరిగిందో అదే పునరావృత మవుతుందని అన్నారు. ÷ళిశంలోని జనాభా మార్పు కోసం జరుగుతున్న కుట్రలో భాగమే 'లవ్ జిహాద్' అని యోగి ఆదిత్యనాథ్ పేర్కొన్నారు. రామాయణ కాలంలో కూడా ఖాళీగా ఉన్న భూములను మారీచుడు, ఖరదూషణాది రాక్షసులు దురాక్రమణ చేసేవారని, ల్యాండ్ జిహాద్‌కు పాల్పడేవారని అన్నారు. ప్రతి యుగంలోనే దుష్టశక్తులు ఉంటాయని, అయితే సత్యం, మతం పరిరక్షణకు శ్రీరాముడు ఏవిధంగా పాటుపడ్డారో అందరూ తెలుసుకుని కర్తవ్యబద్ధులుకావాలని, అంతా ఐక్యంగా నిలవాలని అన్నారు.

# విజయన్ కుమార్తెకు ఈడీ సమన్లు

**మనీలాండరింగ్ కేసులో 12న విచారణకు హాజరు కావాలంటూ ఆదేశం**



**తిరువనంతపురం**
ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో అధికారాన్ని కోల్పోయిన కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కుమార్తె వీణాకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీ చేసింది. మనీలాండరింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆమెను ప్రశ్నించేందుకు ఈ నెల 12న కొచ్చిలోని తమ జోనల్ కార్యాలయానికి హాజరు కావాలని కోరింది. పీఎంఎల్ఏ చట్టం కింద ఆమె స్టేట్‌మెంట్‌ను రికార్డు చేయనున్నట్టు అధికారులు తెలిపారు.వీణాతో పాటు మరికొందరికి కూడా ఈడీ సమన్లు జారీ చేసింది. కేరళకు చెందిన ఇసుక వెలికితీత సంస్థ కొచ్చిన్ మినరల్స్ అండ్ రుటైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్), వీణాకు చెందిన మూతపడిన ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లు మనీలాండరింగ్‌కు పాల్పడినట్టు ఈడీ ఆరోపణలు నమోదు చేసింది.

## ప్రాజెక్టులకు అడ్డుపడ్డానని నిరూపిస్తావా

మొదటి తరువాయి

రెడ్డి బెదిరింపులకు తాను భయపడే వ్యక్తిని కానన్నారు. సీఎం రేవంత్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సీఎం స్థాయిని మరిచి మాట్లాడుతున్నారంటూ రేవంత్‌రెడ్డిపై కిషన్ రెడ్డి నిప్పులు చెరిగారు. సీఎం రేవంత్ రెడ్డిలాగా తాను మాటకారిని కాను.. కానీ మాటపై నిలబడే వ్యక్తిని అని కిషన్ రెడ్డి కుండబద్దలు కొట్టారు. పదవులు, అధికారం కోసం మాటలు మార్చే వ్యక్తిని తాను కానని స్పష్టం చేశారు. చిల్లర రాజకీయాలు చేయడం తనకు అలవాటు లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై ఎక్కడైనా తాను చర్చకు సిద్ధమని అధికార పార్టీ నేతలకు కిషన్‌రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. మీరిచ్చిన ఏ గ్యారంటీ అయినా అమలు చేశారా? అంటూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారని వ్యంగ్యంగా అన్నారు. దోచుకోవడం, దాచుకోవడం, ప్రజలను వంచించడంలో.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు దొందూ దొందేనని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారంటూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. బీజేపీ నేతలను సీఎం రేవంత్ రెడ్డి బెదిరిస్తున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను గమనించాలంటూ తెలంగాణ సమాజానికి ఈ సందర్భంగా సూచించారు. సీఎం రేవంత్‌కు తాము గులాంలు కామన్నారు. తనకు సీఎం రేవంత్‌రెడ్డి సర్టిఫికెట్ అవసరం లేదని మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

## హెచ్1 బి వీసాపై
# ట్రంప్‌కు షాక్

మొదటి తరువాయి



చట్ట విరుద్ధమైన పన్ను అని ప్రకటిస్తూ ఆ నిబంధన చెల్లదని కొట్టిపారేశారు. కోర్టు తీసుకున్న ఈ నిర్ణయంతో ఐటీ సహా పలు రంగాలకు చెందిన వేలాది మంది విదేశీ నిపుణులకు, ముఖ్యంగా భారతీయ టెక్కీలకు పెద్ద ఊరట లభించింది.

# ఇందిరమ్మ రాజ్యంలోనే మహిళలకు పెద్దపీట

**-మహిళా సాధికారతకు మరో అడుగు**
**-వారిని కోటీశ్వరులను చేసే పనిలో వెనకడుగు లేదు**
**-మహిళల స్ఫూర్తితోనే తమ ప్రజాపాలన సాగుతోంది**
**-వారి దెబ్బకే కొందరు ఫమ్‌హౌజ్‌కు పరిమితం అయ్యారు**
**-కెసిఆర్ హయాంలో మంత్రి పదవులు కూడా ఇవ్వలేదు**
**-బిజెపి కనీసం మహిళకు అధ్యక్ష పదవి ఇవ్వలేదు**
**-పరేడ్ గ్రౌండ్స్ సభలో సిఎం రేవంత్ రెడ్డి**



హైదరాబాద్
మహిళా సాధికారతకు తమ సర్కార్ మరో కీలక అడుగు వేసిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం.. మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ చేస్తున్నామని ఉద్ఘాటించారు. మహిళా శక్తి పథకం కింద 553 బస్సులు పంపిణీ చేశామని వ్యాఖ్యానించారు. మహిళలకు ఓటు హక్కు ఇచ్చింది కాంగ్రెస్ అని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో బస్సులను సీఎం ప్రారంభించి ప్రసంగించారు. దేశానికి తొలి మహిళా రాష్ట్రపతిని అందించింది కాంగ్రెస్సేనని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. బీజేపీ అధ్యక్ష పదవిని ఒక్కసారైనా మహిళకు ఇచ్చారా అని ప్రశ్నించారు. మహిళలను స్ఫూర్తిగా తీసుకుని పరిపాలన చేస్తున్నామని వివరించారు. మహిళలను పరిపాలనలో భాగస్వామ్యం చేస్తామని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలోని తొలి ఐదేళ్లలో ఒక్క మహిళకైనా మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. తమ ప్రభుత్వంలో ఇద్దరు మహిళలకు మంత్రి పదవులు ఇచ్చామని ప్రస్తావించారు. మహిళలను స్ఫూర్తిగా తీసుకుని పరిపాలన చేస్తున్నామని వివరించారు. మహిళలను పరిపాలనలో భాగస్వామ్యం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పుకొచ్చారు. మహిళా సంఘాల్లో 67 లక్షల మంది ఆడబిడ్డలు ఉన్నారని తెలిపారు. ఆడబిడ్డలతో పెట్టుకుంటే అధికారంలో ఉంటారా? అని ప్రశ్నించారు. తమ అక్కలు పెట్టిన వాతలతోనే కొందరు ఫామ్‌హౌస్‌లో పండుకున్నారని విమర్శించారు. ఉచిత బస్సుతో స్కూళ్లలో ఆడపిల్లల డ్రాపౌట్స్ తగ్గాయని అన్నారు. ఉచిత బస్సు పథకం కోసం రూ.10 వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. కడుపు నిండా విషం పెట్టుకుని ఉచిత బస్సు పథకం ఆపాలని కొంతమంది చూశారని ధ్వజమెత్తారు. ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టి రోడ్డుపైకి పంపారని సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహించారు. 27 వేల స్కూళ్ల నిర్వహణ బాధ్యత కూడా ఆడబిడ్డలకు అప్పగించామని తెలిపారు. మిడ్ డే మీల్ పథకం సరుకులు కూడా మహిళలే సరఫరా చేస్తున్నారని వెల్లడించారు. పెట్రోల్ బంకుల నిర్వహణ అప్పగించడంతో లక్షలు సంపాదిస్తున్నారని చెప్పుకొచ్చారు. 8 వేల స్త్రీ శక్తి భవనాలు ఒకేసారి పూర్తిచేస్తామని అన్నారు. కార్పొరేట్ ఆఫీస్‌ల కంటే మిన్నగా స్త్రీ శక్తి భవనాలు ఉంటాయని వివరించారు. హైటెక్ సిటీ దగ్గర మహిళలకు రూ.1000 కోట్ల భూమి కేటాయించామని ప్రస్తావించారు. 106 స్టాల్స్‌తో అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో మాల్ నిర్మించామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులుగా మారుస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. దళారులు, దోపిడీదారులకు తమ ప్రభుత్వంలో చోటులేదని స్పష్టం చేశారు. 2034 వరకు ప్రజాప్రభుత్వం కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఆడబిడ్డలకు అండగా ఉండే బాధ్యత తమదని తెలిపారు. ఎవరెన్ని కుట్రలు చేసినా మహిళా సంఘాలను ఆదుకుంటున్నామని చెప్పుకొచ్చారు. రూ.60 వేల కోట్ల రుణాలతో ఆర్థికంగా నిలబెడుతున్నామని తెలిపారు. ఆడబిడ్డలు సంతోషంగా ఉండాలని మంచి చీరలు ఇస్తున్నామని వివరించారు. కేసీఆర్ హయాంలో ఇచ్చిన చీరలను ఎవరైనా కట్టుకున్నారా? అని ప్రశ్నించారు. ఆడబిడ్డల సంక్షేమానికి అన్నివేళలా కృషిచేస్తామని తెలిపారు. పంట మార్పిడి విషయంలో మహిళలు చొరవ చూపాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. మన సంస్కృతి, సంప్రదాయల్లో మహిళలకు ప్రత్యేక గుర్తింపు ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలోనే మహిళలకు గుర్తింపు ఉంటుంది. మహిళలకు ఇవ్వాల్సిన రూ.4వేల కోట్ల సున్నా వడ్డీ నగదును గత ప్రభుత్వం చెల్లించలేదు. మహిళలతో పెట్టుకున్న ఎవరైనా అధికారంలో ఉంటారా? మహిళలతో పెట్టుకున్నందుకే బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోయింది. మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం ఆర్టీసీకి రూ.10,500 కోట్లు చెల్లించాం' అన్నారు. అందరికంటే ముందుంటామని మహిళలు నిరూపిస్తున్నారు. వ్యవసాయానికి ప్రాణవాయువు ఆడబిడ్డలు. ఆడబిడ్డ పుడితే.. మహాలక్ష్మి వచ్చిందని సంతోషపడే సంస్కృతి మనది. మన సంస్కృతి, సంప్రదాయాల్లో మహిళలకు ప్రత్యేక గుర్తిపు ఉంది. మహిళా శక్తిని ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత ఇందిరాగాంధీకి దక్కుతుంది. మహిళలను స్ఫూర్తిగా తీసుకొని మేం పరిపాలన చేస్తున్నాం. అమెరికాలో మహిళలకు ఓటు హక్కు వచ్చేందుకు వందల ఏళ్లు పట్టింది. భారత్‌కు స్వాతంత్య్రం రాగానే మహిళలకు ఓటు హక్కు ఇచ్చిన ఘనత నెహ్రూకే దక్కుతుందని రేవంత్ అన్నారు. స్థానిక ఎన్నికల్లో మహిళలకు రాజీవ్‌గాంధీ రిజర్వేషన్లు ఇచ్చారు. సోనియా గాంధీ 2013లో చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు ఇవ్వాలని బిల్లు ప్రవేశపెట్టారు. అంబానీ, ఆదానీలకు పోటీగా పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్‌ను రాష్ట్ర మహిళలు నిర్వహిస్తున్నారు. త్వరలోనే మహిళా శక్తి భవనాలు నిర్మిస్తామని అన్నారు.

# ధాన్యం కొనుగోళ్లపై కేంద్రం తిరకాసు

మొదటి తరువాయి

ఉందన్నారు. నాగర్ కర్నూల్ జిల్లాలో ఇంకా పంట సాగవుతుందని చెప్పారు. ప్రతిపక్షాలు చెప్పేవన్నీ ఆబద్దాలేనని పేర్కొన్నారు. పౌర సరఫరాల శాఖ కార్యాలయం నుంచి నేరుగా ఆన్‌లైన్‌లో రైతులు, మహిళా సంఘాల అకౌంట్‌లో నగదు వేస్తున్నామని చెప్పారు. మహిళ సంఘాలకు కేంద్ర ప్రభుత్వం నిధుల నుంచి రూ.170 కోట్లు చెల్లించామని వివరించారు.
8 లక్షల మెట్రిక్ టన్నుల మొక్క జొన్న కూడా కొనుగోలు చేశామని తెలిపారు. క్వింటాకు రూ.1000 నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా ఇంత బాధ్యతగా కొనుగోలు చేయలేదని చెప్పారు. భవిషత్తులో పాడి ప్రోక్యూర్‌మెంట్‌లో ఏ విధంగా పోవాలని దేశంలో వివిధ రాష్ట్రాల్లో ప్రత్యేక బృందాలు పర్యటిస్తున్నాయని వివరించారు. రాష్ట్రంలో హమాలీల సమస్య అధికంగా ఉందన్నారు.
తెలంగాణలో ప్రస్తుతం ఉన్న స్టోరేజ్ సరిపోవడం లేదన్నారు. బుధవారం మేడిగడ్డలో మూడు బ్యారేజీల టెస్టింగ్ పక్రియపై సమీక్ష చేస్తామని చెప్పారు. ఈ మూడు బ్యారేజిల్లో నీళ్లు నింపొద్దని ఇప్పటికే నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఎన్‌డీఎస్ఏ చెప్పిందని గుర్తు చేశారు. మేడిగడ్డలో నీళ్లు నింపితే కొట్టకుపోతాయని ఎన్‌డీఎస్ఏ స్పష్టం చేసిందన్నారు. దేశంలోనే రికార్డ్ స్థాయిలో తెలంగాణలో ధాన్యం కొనుగోళ్లు చేశామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెంగాణలో ఎక్కువ ధాన్యం ఉత్పత్తి అయ్యిందని.. యాసంగిలో రికార్డ్ స్థాయిలో ధాన్యం కొన్నామని చెప్పారు. రబీ, ఖరీఫ్ సీజన్ కలిపి 147 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని.. ఇన్ని టన్నుల ధాన్యం సేకరణ దేశంలోనే రికార్డ్ అని తెలిపారు. వడ్ల కొనుగోళ్లకు సంబంధించి రూ.35,077 కోట్లు రైతుల ఖాతాలో వేశామన్నారు. 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని.. రైతులకు ఇబ్బంది లేకుండా స్థానికంగా ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం 52 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ టార్గెట్ పెట్టిందని.. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 75 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించిందని తెలిపారు. తెలంగాణ పొరుగు రాష్ట్రం ఏపీలో 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు మాత్రమే జరిగిందని పేర్కొన్నారు. దేశంలో ఉత్పత్తి అయ్యే వరిలో 61 శాతం తెలంగాణలోనే అవుతుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు ద్వారా మహిళా సంఘాలు, పీఏసీలను బలపరుస్తున్నామన్నారు.

# లక్షద్వీప్‌లో మద్యం అమ్మకాలకు గ్రీన్‌సిగ్నల్

**-47 ఏండ్ల నిషేధం ఎత్తివేత..**
**-1979 నాటి పాత చట్టాన్ని రద్దు చేసిన కేంద్రం**
**-లైసెన్స్ ఉంటేనే ఇకపై మద్యం విక్రయాలు**
**-విదేశీ లిక్కర్‌పై 400%, బీర్లపై 200 శాతం ఎక్సైజ్ సుంకం!**
**- మాల్దీవులకు పోటీగా టూరిజం హబ్**
**- స్థానిక సెంటిమెంట్లు దాటి కేంద్రం కీలక నిర్ణయం**



**న్యూఢిల్లీ:**
ముస్లింలు అధికంగా నివసించే కేంద్రపాలిత ప్రాంతమైన లక్షద్వీప్‌లో ఆల్కహాల్ అమ్మకాలకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పర్యాటకాభివృద్ధి లక్ష్యంగా గత 47 ఏండ్లుగా కొనసాగుతున్న నిషేధాన్ని ఎత్తివేసింది. ఈ మేరకు 1979లో అమల్లోకి వచ్చిన 'లక్షద్వీప్ ప్రొహిబిషన్ రెగ్యులేషన్'ను రద్దు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో నియంత్రిత విధానంలో లైసెన్స్ పొందిన దుకాణాల ద్వారా మద్యం విక్రయాలకు మార్గం సుగమమైంది. కొత్తగా అమల్లోకి వచ్చిన లక్షద్వీప్ ఎక్సైజ్ రెగ్యులేషన్ 2026 ప్రకారం మద్యం తయారీ, దిగుమతి, ఎగుమతి, రవాణా, కొనుగోలు, విక్రయాలు, వినియోగం వంటి అంశాలు అన్నింటినీ లైసెన్సింగ్ వ్యవస్థ ద్వారా నియంత్రించనున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు కూడా మద్యం దిగుమతి, రిటైల్ విక్రయాలకు అనుమతి పొందే వెసులుబాటు కల్పించింది. **భారీగా పన్నులు** అయితే మద్యం అందుబాటులోకి తెస్తున్నప్పటికీ అధిక పన్నులు విధించారు. ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్, విదేశీ మద్యంపై 400 శాతం, బీర్లపై 200 శాతం, వైన్‌పై 80 శాతం వరకు ఎక్సైజ్ సుంకం విధించారు. అలాగే 21 ఏండ్లలోపు వారికి మద్యం విక్రయించడంపై నిషేధం ఉంచారు. అవసరమైతే లక్షద్వీప్‌లోని ఏదైనా ప్రాంతంలో మళ్లీ నిషేధం విధించే అధికారం అడ్మినిస్ట్రేటర్‌కు ఉంటుంది.

**లక్షద్వీప్‌లో మద్యంపై నిషేధం ఎందుకు?**
లక్షద్వీప్‌లో సుమారు 97 శాతం జనాభా ముస్లింలే. భారతదేశంలోని ఏ రాష్ట్రం లేదా కేంద్రపాలిత ప్రాంతంతో పోల్చినా ఇది చాలా అధికం. ఇస్లాం మతంలో మద్యపానాన్ని నిషేధించిన నేపథ్యంలో 1979 నుంచి లక్షద్వీప్‌లో మద్యం అమ్మకాలపై నిషేధం అమలు చేశారు. అయితే ఈ నిషేధం పూర్తిస్థాయిలో లేదు. పర్యాటకులు, ప్రభుత్వ అధికారుల కోసం కొన్ని మినహాయింపులు ఉండేవి. కానీ లక్షద్వీప్‌ను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం మద్యపానంపై నిషేధాన్ని ఎత్తివేసింది. మాల్దీవులు వంటి సముద్ర ద్వీప పర్యాటక కేంద్రాలతో పోటీ పడాలంటే నిషేధం అడ్డంకిగా మారుతుందని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

# నైరుతి ఆగమనంతో పలకరించిన తొలకరి

మొదటి తరువాయి

పలుచోట్ల రహదారులపై వర్షం నీరు చేరింది. ముషీరాబాద్‌లో ఈదురుగాలులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. భాగ్యనగరంలో భారీ వర్షం కురుస్తోండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. సిటీలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతోండటంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రోడ్లపై భారీగా వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా లోతట్టు కాలనీలు, ప్రధాన రహదారులు, కూడళ్లలో నీరు చేరడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పంజాగుట్ట, ఖైరతాబాద్, బంజారాహిల్స్, యూసఫ్‌గూడ, టోలీచౌకి, ఫిలింనగర్, అమీర్‌పేట్, ఎస్సార్‌నగర్, ఎర్రగడ్డ, సనత్‌నగర్ తదితర ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. పలు ప్రాంతాల్లో వాహనాలు నెమ్మదిగా సాగుతుండగా, కొన్ని చోట్ల ట్రాఫిక్ జాం అయింది. కార్యాలయాలు, విద్యాసంస్థల నుంచి ఇళ్లకు వెళ్లే ప్రజలు వర్షం కారణంగా ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ సిబ్బంది అప్రమత్తమయ్యారు. నీరు నిలిచిన ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపడుతూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని, వర్షపు నీరు నిలిచిన ప్రాంతాల్లో జాగ్రత్తగా ప్రయాణించాలని అధికారులు సూచిస్తున్నారు. వాతావరణ శాఖ అధికారులు మరికొన్ని గంటల పాటు నగరంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ స్తంభాలు, చెట్లు, నీటితో నిండిన ప్రాంతాల వద్ద జాగ్రత్తలు పాటించాలని సూచించారు. భారీ వర్షాల ప్రభావంతో నగరంలోని పలు లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తెలంగాణలో బుధవారం కూడా పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో నేడు అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు తెలిపింది. గంటకు 40 నుంచి 50కి.మీ వేగంతో ఈదురుగాలులతో వర్షాలు పడొచ్చని పేర్కొంది. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్ జిల్లాలకు మోస్తరు వర్ష సూచన ఉన్నట్లు తెలిపిన వాతావరణ శాఖ అధికారులు.. కామారెడ్డిలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే, బుధవారం వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో పలు చోట్ల భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు.

# 18 గంటలు పనిచేస్తున్నాం

మొదటి తరువాయి

ఆరోపించారు. మంగళవారం నాడు జిల్లాలోని చిల్పూర్ మండలం పల్లగుట్టలో పర్యటించిన భట్టి.. 33/11కెవి సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు పేదలకు సన్నబియ్యం ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అభివృద్ధి, సంక్షేమం ఆపడం లేదని డిప్యూటీ సీఎం వెల్లడించారు. 76 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామన్నారు. కేంద్ర ప్రభుత్వం వడ్లను ఎందుకు కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు. కార్పోరేట్ శక్తుల దయాదక్షిణ్యాల కోసం రైతులు ఎదురు చూసేలా కేంద్రం చేస్తోందని విమర్శించారు. ఏ రాష్ట్రంలోనూ వడ్ల కొనుగోళ్లు జరగడం లేదన్నారు. తాము మొక్కజొన్నలు కూడా కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఉచిత విద్యుత్ ఇచ్చింది కానీ డిస్కమ్‌లకు డబ్బులు చెల్లించలేదన్నారు. కానీ ఇప్పుడు డిస్కమ్‌లకు డబ్బులు చెల్లిస్తున్నామని అన్నారు. ఎన్నికల సందర్భంగా నేను, సీఎం ఇక్కడి ప్రజలకు హామీలు ఇచ్చాం. ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం' అని భట్టి తెలిపారు. దేవాదుల ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని వ్యాఖ్యానించారు. దేవాదుల ప్రాజెక్టు పనులు త్వరలోనే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. రైతులకు రుణమాఫీ చేయడంతో పాటు.. తడిసిన ధాన్యాన్ని కూడా కొంటున్నామన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం ఒకప్పుడు వలసల ప్రాంతమని.. కానీ ఇప్పుడు అభివృద్ధి జరుగుతోందన్నారు. రఘునాథపల్లిలో 230ఐ÷ఎ సబ్ స్టేషన్ ఏర్పాటును పరిశీలిస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. తడిచిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. 72 లక్షల టన్నుల ధాన్యం సేకరించి రూ.14వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశాం.

# భారత్ ఫ్యూచర్ సిటీకి మరో మైలురాయి

**-ఎఫ్‌సీడీఏ నూతన కార్యాలయ భవనాన్ని ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి**

**-కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



**ఆమనగల్లు, జూన్ 09 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : తెలంగాణ రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధి దిశగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులో మరో కీలక ఘట్టం ఆవిష్కృతం కానుంది. మీర్‌ఖాన్‌పేట్‌లో నిర్మించిన ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) నూతన కార్యాలయ భవనాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి వెల్లడించారు. మంగళవారం కడ్తాల్ మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ముందుకు తీసుకెళ్తోందన్నారు. ఈ క్రమంలో ఎఫ్‌సీడీఏ నూతన కార్యాలయ భవనం ప్రారంభం ప్రాజెక్టు అభివృద్ధిలో మరో మైలురాయిగా నిలవనుందని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సమగ్ర పట్టణాభివృద్ధి, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ఉపాధి అవకాశాల విస్తరణకు ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుందని ఎమ్మెల్యే తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని రూపొందిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ తెలంగాణ అభివృద్ధి చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోనుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి పాల్గొనే ఈ కార్యక్రమానికి కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యువత, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, మండల కాంగ్రెస్ అధ్యక్షులు బిచ్య నాయక్, డోకూరి ప్రభాకర్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ చేగురి వెంకటేష్, సర్పంచ్ బిక్షపతి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లేష్ గౌడ్, లక్ష్మయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు బోసు రవి, భాను కిరణ్, జహంగీర్ బాబా, జహంగీర్ అలీ, చందోజీ శ్రీకాంత్, రమేష్, మల్లయ్య, పర్వతాలు, శివ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆర్టీసీ బస్సుల ప్రారంభోత్సవం



**తెలకపల్లి, జూన్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గౌరవ ఎమ్మెల్యే సీతక్క, నాగర్‌కర్నూల్ శాసనసభ్యులు రాజేష్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 553 బస్సుల ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా మన తెలకపల్లి మండల మహిళా సమైక్య బస్సు సికింద్రాబాద్ ప్యారేడ్ గ్రౌండ్ నుంచి బయలుదేరింది. స్థానిక సర్పంచ్ శేఖర్, ఉపసర్పంచి వారణాసి శ్రీను, సింగిల్ విండో వైస్ ప్రెసిడెంట్ యాదయ్య పచ్చజెండా ఊపి బస్సును ప్రారంభించి స్వాగతం తెలిపారు. కార్యక్రమంలో వార్డ్ మెంబర్లు, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు రామచంద్రమ్మ, ఏపీఎం శేఖర్, సిబ్బంది, మహిళా సంఘ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాల భవన పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

**- ఛైర్మెన్ పత్యనాయక్**



**ఆమనగల్లు, జూన్ 09 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని కోరుతూ కళాశాల ప్రిన్సిపాల్ మాధవరావు, అధ్యాపక బృందంతో కలిసి మంగళవారం పట్టణ కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో ఛైర్మన్ పత్యనాయక్ ను కలిశారు. కళాశాల భవన నిర్మాణానికి సంబంధించిన పెండింగ్ సమస్యను తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఒకే ప్రాంగణంలో కొనసాగుతున్నందున విద్యార్థులు, అధ్యాపకులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. తరగతి గదుల కొరత, మౌలిక వసతుల సమస్యలతో విద్యా కార్యక్రమాల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. వారి వినతిని శ్రద్ధగా ఆలకించిన చైర్మన్ పత్యనాయక్ కళాశాల భవన సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల అడ్మిషన్ల బ్రోచర్‌ను చైర్మన్ పత్యా నాయక్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో చేరి నాణ్యమైన విద్యను పొందాలని అధ్యాపకులు కోరారు.

## సమ్మర్ క్యాంపు ప్రత్యేక కరాటే శిక్షణలో విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్



**జగిత్యాల, జూన్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెగడపల్లి మండలంలోని శ్రీ వైష్ణవి హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించిన 45 రోజుల కరాటే ప్రత్యేక శిక్షణలో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఓకినోవా మార్చల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన బెల్ట్ గ్రేడింగ్ టెస్టులో 27 మంది విద్యార్థులు పాల్గొగా, నలుగురు సీనియర్ బ్రౌన్ బెల్ట్ అందుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఓరుగల అరుణ--శ్రీనివాస్, వెంగళయిపేట సర్పంచ్ గోపాల్, ఉప సర్పంచ్ కుంచె రాజేందర్, వార్డు మెంబర్ రాజశేఖర్ గౌడ్ విద్యార్థులను అభినందించారు. మాస్టర్ గాజుల రాకేష్, వినయ్, గురుప్రసాద్ విద్యార్థులను ప్రోత్సహించి బెల్టులు ప్రధానం చేశారు. సమ్మర్ క్యాంపులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బెల్టులు ప్రధానం చేశారు.

## ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే వినతి

**-కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పణ**




**మెదక్, జూన్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, ఎరువులు--విత్తనాలు అందుబాటులో ఉంచాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి కలెక్టర్ ప్రతిమ సింగ్కు వినతిపత్రం సమర్పించారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి, "జిల్లాలో ఇంకా ధాన్యం కొనుగోలు పూర్తి కాలేదు. వెంటనే స్పందించి కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలి" అని కోరారు. చిన్న శంకరంపేట మండలం కామారం గ్రామంలో కొనుగోలు సజావుగా సాగడం లేదని వివరించారు. రానున్న వర్షాకాలంలో సకాలంలో విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని, సబ్‌స్టేషన్ల వద్ద ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి నిరవధికంగా విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. అలాగే నకిలీ విత్తనాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ అంజిరెడ్డి, మెదక్ పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షులు, మున్సిపల్ 5వ వార్డు కౌన్సిలర్ మామిడ్ల ఆంజనేయులు, 29వ వార్డు కౌన్సిలర్ బట్టి ఉదయ్, రాజిపల్లి గ్రామ సర్పంచ్ దోతి నారాయణ, మాచవరం సర్పంచ్ సాంబశివరావు, మాజీ వైస్ ఎంపీపీ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో భారీ చేరికలు



**అమ్రాబాద్, జూన్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అమ్రాబాద్ మండలంలోని ఉప్పునుంతల గ్రామం నుంచి బిఆర్ఎస్ పార్టీకి చెందిన 70 మంది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఆకర్షణగా మారడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు తెలిపారు. బిఆర్ఎస్ వైఖరి నచ్చకపోవడంతో పార్టీని వీడినట్లు పేర్కొన్నారు. ఈ చేరికల కార్యక్రమం అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సమక్షంలో జరిగింది. ఆయన నూతనంగా పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఏంఏ. రహీం, పంబలి బుచ్చయ్య, శివాజీ, సత్యనారాయణ, నాయక్ సర్దార్ జాకీర్, మార్కెట్ కమిటీ చైర్మన్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అమ్రాబాద్ మండలంలో బిఆర్ఎస్‌కు భారీ షాక్, 70 మంది కాంగ్రెస్‌లో చేరిక.

## ఆమనగల్లు పశు వైద్యాధికారిగా పల్లవి



**ఆమనగల్లు, జూన్ 09 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు మండల పశువైద్య శాలలో వైద్యాధికారిగా డా.పల్లవి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలలో భాగంగా సిద్దిపేట జిల్లా ములుగు మండలం నుంచి ఆమె ఆమనగల్లుకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు తలకొండపల్లి పశువైద్య అధికారి డా. విజయ్ కుమార్ ఇన్చార్జ్ గా సేవలందించారు. పశుపోషకులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని డా.పల్లవి తెలిపారు.

## ఇన్‌స్ట్రక్టర్లు, ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులకు ఆహ్వానం



**నాగర్‌కర్నూల్, జూన్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
2026--27 విద్యా సంవత్సరంలో జిల్లాలోని 74 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరగతులు ప్రారంభం కానున్నాయి. ఈ తరగతుల నిర్వహణ కోసం ఇన్‌స్ట్రక్టర్లు, ఆయా పోస్టుల భర్తీ చేపడతామని నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్ తెలిపారు. దరఖాస్తులు జూన్ 9 నుంచి 15 వరకు సంబంధిత మండల విద్యాధికారి కార్యాలయాల్లో స్వీకరించబడతాయి. ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత, ప్రీ-ప్రైమరీ శిక్షణ లేదా టీటీసీ పూర్తి చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. ఆయా పోస్టులకు కనీసం 7వ తరగతి ఉత్తీర్ణత అవసరం. ఇన్‌స్ట్రక్టర్‌కు నెలకు రూ. 8,000, ఆయాకు రూ. 6,000 గౌరవభృతి "అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ" ద్వారా చెల్లించబడుతుంది. ఎంపిక విధానం జిల్లా సెలెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతుందని డీఈఓ రమేష్ కుమార్ వెల్లడించారు.

## వాసవి ఏంజిల్స్ క్లబ్ సమక్షంలో అమ్మవారి పారాయణం



**కరీంనగర్, జూన్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : నగునూరి అమ్మవారి ఆలయంలో వాసవి వనిత ఏంజిల్స్ క్లబ్ ఆధ్వర్యంలో సభ్యులు ఎర్ర చీరలు ధరించి అధిక వాయినాలు, ఓడిబియాలు సమర్పించారు. అనంతరం వాయినాలను ఒకరికొకరు ఇచ్చుకోవడం జరిగింది. ఈ సందర్భంగా గుడిలో సౌందర్యలహరి పారాయణం జరుగగా, సభ్యులు పారాయణంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ఆర్‌సి రాచమల్ల గాయత్రి, జెడ్‌సి వజ్ర లక్ష్మి, క్లబ్ ప్రెసిడెంట్ రావికంటి భాగ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శి పల్లెర్ల విద్య, ట్రెజరర్ గుండ శ్రీదేవి, ఈసీ మెంబర్స్, క్లబ్ సభ్యులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అమ్మవారికి వాయినాలు సమర్పించి, పారాయణంలో పాల్గొన్న వాసవి ఏంజిల్స్ క్లబ్ సభ్యులు.

## రామాయంపేట మున్సిపాలిటీ వార్డులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్



**రామాయంపేట జూన్ 09 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రామాయంపేట మున్సిపాలిటీ 9వ వార్డుల సభలో నీ సమస్యలను స్వయంగా గౌరవనీయులైన కమిషనర్ గారు మరియు వార్డ్ కౌన్సిలర్ దేవుని రంజిత్ గారు శానిటేషన్ ఇన్స్పెక్టర్ గారు. వార్డులు తిరుగుతూ వాటిని పరిష్కరించే దిశగా చేస్తున్నారు . వర్షం కారణంగా నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు అలాగే ఇంటి పక్కన పరిశుభ్రలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు

# నూతన కార్యదర్శికి ఘన సన్మానం



**ఆమనగల్లు, జూన్ 09 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు మండలంలోని ఆకుతోటపల్లి గ్రామ పంచాయతీ నూతన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన పంతు నాయక్ ను గౌరారం గ్రామ యువ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో కార్యదర్శి కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. నూతన కార్యదర్శి పంతు నాయక్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, సిబ్బంది సహకారంతో కృషి చేస్తానని తెలిపారు. గ్రామ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కట్టుబడి ఉంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకటాపురం శివ, గోరటి శివ కుమార్, శెట్టిపల్లి వీరేష్, గోరటి మహేష్, తిరుపతి రెడ్డి తదితరులు ఉన్నారు.

# పంటలు పండాలి

**- అమ్మవారి దయ గ్రామ ప్రజలపై ఉండాలి**

**-చిట్యాల ఉపాధి కూలీల ప్రత్యేక పూజలు**





**మెదక్, జూన్ 9 ((నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మెదక్ మండలంలోని చిట్యాల గ్రామంలో ఉపాధి హామీ కూలీలు మంగళవారం ఘనంగా వనభోజన కార్యక్రమం నిర్వహించారు.గ్రామంలోని ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు చేసి, ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు బాగా పండాలని, గ్రామం పచ్చగా ఉండాలని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ ప్రాంగణంలోనే అందరూ కలిసికట్టుగా వనభోజనాలు చేశారు. మహిళా కూలీలు ఉత్సాహంగా బతుకమ్మలు పేర్చి ఆటపాటలతో సందడి చేశారు."ప్రతిరోజూ ఉపాధి హామీ పనుల్లో బిజీగా ఉండే మేము, ఇలా ఒకేచోట చేరి అమ్మవారిని దర్శించుకుని పండుగ వాతావరణంలో వేడుక జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉంది" అని కూలీలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపాధి హామీ కూలీలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహారం పంపిణీ

**గర్భిణీలు, బాలింతలకు సర్పంచ్ చేతుల మీదుగా అందజేత**



కోడిగుడ్లు బాలామృతం పంపిణీ చేస్తున్న సర్పంచ్ కప్పల ప్రవీణ్

**ఎలిగేడు, జూన్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండల కేంద్రంలోని అంగన్వాడీ సెంటర్--1లో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. గ్రామ సర్పంచ్ కప్పల ప్రవీణ్ గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందజేశారు.ఈ సందర్భంగా చిన్నారుల బరువులు తూచి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. సర్పంచ్ మాట్లాడుతూ, "అంగన్వాడీ కేంద్రాల్లో అందజేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలి" అని సూచించారు.కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ జ్యోతి, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

# కసాపురం దేవస్థానానికి రూ. లక్ష విరాళం అందజేత



**గుంతకల్లు, జూన్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గుంతకల్లు మండలం, కసాపురం గ్రామంలో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థాన అభివృద్ధి కి గాను బెంగళూరు పట్టణానికి చెందిన కె.వి పవన్ కుమార్ కుమార్తె జ్యోతి లక్ష రూపాయలు విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని ఆమె మంగళవారం ఆలయ డిప్యూటీ కమిషనర్, ఈఓ మేడేపల్లి విజయరాజు కు అందజేశారు. దీంతో దాతలకు వేద ఆశీర్వాదం, స్వామి వారి శేష వస్త్రం, ప్రసాదాలు అందజేశారు.

# నేటిరాశి ఫలితాలు

## 09-06-2026





**మేషరాశి**
అవసరానికి సన్నిహితుల సహాయ సహకారాలు అందుతాయి. వ్యాపారములు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన పనులలో జాప్యం కలిగిన నిదానంగా పూర్తిచేస్తారు. కుటుంబ వ్యవహారాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. వృత్తి ఉద్యోగాలలో సమస్యలను తెలివిగా పరిష్కరించుకుంటారు. అదృష్ట రంగు :ఎరుపు సంఖ్య: 2

**వృషభరాశి**
ఆరోగ్య విషయంలో కొంత జాగ్రత్తగా వ్యవహరించాలి. ప్రయాణాలలో వాహన ప్రమాద సూచనలున్నవి. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. ముఖ్యమైన వ్యవహారాలలో సన్నిహితులతో వివాదాలు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. నిరుద్యోగుల ప్రయత్నాలు కలసిరావు. అదృష్ట రంగు :తెలుపు
సంఖ్య :3

**మిథునరాశి**
చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. నూతన ఋణ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. నూతన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. ధార్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. సమాజంలో ప్రముఖుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. వ్యాపార, ఉద్యోగ ప్రయత్నాలలో అవరోధాలు తొలగుతాయి. అదృష్ట రంగు: ఆకుపచ్చ సంఖ్య: 4

**కర్కాటకరాశి**
సంఘంలో పెద్దలతో పరిచయాలు విస్తృతమౌతాయి. ఉద్యోగస్తుల జీతభత్యాల విషయంలో శుభవార్తలు అందుతాయి. నిరుద్యోగులకు నూతన ఉద్యోగావకాశములు లభిస్తాయి. స్థిరాస్తి వ్యవహారాలలో సమస్యలు అధిగమిస్తారు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. అదృష్ట రంగు : వెండి రంగు
సంఖ్య: 5

**సింహరాశి**
వ్యాపారాలలో స్వంత ఆలోచనలు అంతగా కలసిరావు. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు ఉంటాయి. మిత్రులతో దైవ దర్శనాలు చేసుకుంటారు. కుటుంబ పెద్దల ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించాలి. చేపట్టిన వ్యవహారాలు మధ్యలో నిలిచిపోతాయి. వృత్తి ఉద్యోగాలు సామాన్యంగా సాగుతాయి. అదృష్ట రంగు :బంగారు రంగు సంఖ్య: 6

**కన్యరాశి**
చేపట్టిన పనులలో అవరోధాలు కలుగుతాయి. నూతన ఋణ యత్నాలు కొంత కష్టంతో పూర్తి అవుతాయి. బందు మిత్రులతో మాటపట్టింపులుంటాయి. దూరపు బంధువుల నుండి కీలక విషయాలు తెలుస్తాయి. వ్యాపార వ్యవహారాలలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. వృత్తి ఉద్యోగాలు కొంత నిదానంగా సాగుతాయి. అదృష్ట రంగు: ఆకుపచ్చ సంఖ్య: 7

**తులరాశి**
భూ క్రయవిక్రయాలలో విశేషమైన లాభాలు అందుతాయి. చేపట్టిన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. కుటుంబ పెద్దలతో గృహమున సందడిగా గడుపుతారు. బంధు మిత్రులతో విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి,ఉద్యోగాలలో హోదాలు పెరుగుతాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. అదృష్ట రంగు :తెలుపు
సంఖ్య: 8

**వృశ్చికరాశి**
ఆప్తులతో దీర్ఘకాలిక వివాదాలు తీరి ఊరట చెందుతారు. అనుకున్న సమయానికి పనులు పూర్తిచేస్తారు. వృత్తి వ్యాపారాలు మరింత అనుకూలంగా సాగుతాయి. సమాజంలో గౌరవ మర్యాదలు విస్తృతమౌతాయి. వృత్తి ఉద్యోగ విషయంలో ఉన్న సమస్యలు అధిగమిస్తారు. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. అదృష్ట రంగు: మెరున్
సంఖ్య :పెండ్లి

**ధనస్సురాశి**
ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. దైవ సేవా కార్యక్రమాలపై ఆసక్తి పెరుగుతుంది. వృత్తి ఉద్యోగాలలో ఊహించని సమస్యలు కలుగుతాయి. సంతాన విద్యా విషయాలు నిరుత్సాహపరుస్తాయి. ఆర్థిక వ్యవహారాలు కొంత చికాకు పరుస్తాయి. వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. అదృష్ట రంగు: పసుపు సంఖ్య :1

**మకరరాశి**
ముఖ్యమైన వ్యవహారాలలో కొంత జాప్యం కలుగుతుంది. ఋణ దాతల నుండి ఒత్తిడి పెరుగుతుంది. వ్యాపార ఉద్యోగాలలో అదనపు బాధ్యతల వలన తగిన విశ్రాంతి ఉండదు. దూరప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. బంధువుల నుండి అందిన ఒక వార్త నిరుత్సాహం కలిగిస్తుంది. అదృష్ట రంగు :నీలం
సంఖ్య:2

**కుంభరాశి**
బంధు మిత్రుల సహాయ సహకారాలు అందుతాయి. సోదరులతో స్థిరాస్తి ఒప్పందాలు కుదురుతాయి. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. గృహ నిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. ఆత్మీయులతో కీలక విషయాల గురించి చర్చిస్తారు. వృత్తి ఉద్యోగాలలో సమస్యల నుంచి అధికారుల సహాయంతో బయటపడతారు. అదృష్ట రంగు: నీలం
సంఖ్య :3

**మీనరాశి**
సంతాన ఆరోగ్య విషయంలో కొంత జాగ్రత్త అవసరం. చేపట్టిన పనులలో అవరోధాలు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలలో అంచనాలు అందుకోవడంలో సమస్యలు తప్పవు. ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. ఋణ సంబంధిత సమస్యలు వలన ఒత్తిడి తప్పదు. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. అదృష్ట రంగు: పసుపు సంఖ్య :4

**(రాశి ఫలాలు నిపుణులు సలహాలతో పరిగణించండి)**

**శ్రీ కాలభైరవ ఉపవాసకులు**
**డక్క జంబులయ్య (స్వామి )**
**9491 163914**



# డీఈఓ ప్రశాంత్ రెడ్డితో తపస్ ప్రతినిధుల భేటీ



**కరీంనగర్, జూన్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎన్. ప్రశాంత్ రెడ్డిని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసింది.ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, బోధనాభ్యసన ప్రక్రియలో వారు పూర్తిగా దృష్టి సారించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యాలయ పనులు పారదర్శకంగా జరిగేలా జవాబుదారీతనంతో వ్యవహరిస్తానని, ఉపాధ్యాయులకు సంబంధించిన సమాచారం వాట్సాప్ ద్వారా చేరేలా ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు.జిల్లా విద్యా ప్రమాణాలను పెంపొందించి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు ఉపాధ్యాయులు 100% చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన కోరారు.తపస్ ప్రతినిధులు మాట్లాడుతూ విద్యా ప్రమాణాల మెరుగుదల, విద్యార్థులలో జాతీయ భావం, నైతిక విలువలు పెంపొందించడం, పాఠశాలలకు మౌలిక వసతులు కల్పించడం వంటి అంశాల్లో తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు అన్నమనేని తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి జారతి నర్సయ్య, సెక్టోరియల్ అధికారులు చాడ అశోక్ రెడ్డి, దాసరి శ్రీనివాస్, మిల్కూరి శ్రీనివాస్, ఉమారాణి, ఇతర నాయకులు పాల్గొన్నారు.జిల్లా విద్యా ప్రమాణాలను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలని డీఈఓ ప్రశాంత్ రెడ్డి సంకల్పించారు.

# ఎస్టియుటిఎస్ 80వ ఆవిర్భావ దినోత్సవం



**ఖానాపూర్, జూన్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఎస్టియుటిఎస్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం 80వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్మల్‌లోని ఎస్టియు భవన్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన సీనియర్ ఉపాధ్యాయుడు రాజేశ్వర్ చేతుల మీదుగా సంఘ పతాక ఆవిష్కరణ జరగడం విశేషం. సంఘ చరిత్ర, సేవలు, ఉపాధ్యాయ సంక్షేమానికి అందించిన కృషిని సభ్యులు స్మరించుకున్నారు.80 ఏళ్ల ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటూ సంఘ ఐక్యతను మరింత బలోపేతం చేయాలని సభ్యులు సంకల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు భూమన్న యాదవ్, ప్రధాన కార్యదర్శి జె. లక్ష్మణ్, కోశాధికారి బివి రావు, టౌన్ ప్రెసిడెంట్ దూస లక్ష్మీనారాయణతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఉపాధ్యాయ సంఘం 80 ఏళ్ల సేవా ప్రస్థానం ఘనంగా గుర్తుచేసుకున్నారు.

# జూన్ 11న జరగనున్న రైతు సమ్మేళనం విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చిన బీజేపీ నేతలు

**జమ్మికుంట, జూన్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**: హుజురాబాద్ నియోజకవర్గంలోని జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రంలో ఈనెల 11న బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతు సమ్మేళనం జరగనుంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. రసాయన ఎరువులు, పురుగుల మందుల వినియోగాన్ని తగ్గించి రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు ప్రోత్సహించడమే లక్ష్యమని ఆయన తెలిపారు. భూసార పరిరక్షణతో పాటు ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించడంలో ప్రకృతి వ్యవసాయం కీలకమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయని,



జమ్మికుంటలో జరిగే రైతు సమ్మేళనానికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని వెల్లడించారు. జిల్లాలోని రైతులు, వ్యవసాయ అనుబంధ రంగాల ప్రతినిధులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సింగిరెడ్డి కృష్ణారెడ్డి, మాడ వెంకట్ రెడ్డి, గుజ్జ శ్రీనివాస్, పుప్పాల రఘు, ఆకుల రాజేందర్, నరసింహరాజు, సంఘ నరేష్, ముత్యాల జగన్ రెడ్డి, కులకాని రాజు, రమేష్ యాదవ్, బైరెడ్డి రమణారెడ్డి, బత్తిని నరేష్, రాకేం శ్రీనివాస్, తూర్పాటి రాజు, పోరెడ్డి కొండారెడ్డి, సంపెల్లి సంపత్ రావు, ఇండ్ల ప్రభాకర్, టంగుటూరి రాజ్ కుమార్, కేవీడీ కుమార్ తదితరులు పాల్గొన్నారు. జూన్ 11న జమ్మికుంటలో జరగనున్న రైతు సమ్మేళనానికి బీజేపీ నేతలు పిలుపునిచ్చారు.






# ఎలిగేడు సర్పంచ్‌కు ఘన సన్మానం

**-ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో కార్యక్రమం**

**ఎలిగేడు, జూన్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు గ్రామ సర్పంచ్ కప్పల ప్రవీణ్ను మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, ప్రవీణ్




సర్పంచ్ కప్పల ప్రవీణ్ ను సన్మానిస్తున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు.

గతంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్‌గా పనిచేసి అనేకమంది విద్యార్థులను రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దారని గుర్తుచేశారు. రాబోయే కాలంలో ఆయన నాయకత్వంలో గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు కే. సతీష్, ఎం. ఆనంద్, డి. లక్ష్మణ్, ఎం. సంతోష్ కుమార్, వి. శ్రీనివాస్, ఆర్. నాని, జె. అజిత్ రెడ్డి, ఎం. బానిష్, టి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రుణ లక్ష్యాల సాధనకు బ్యాంకర్లకు కలెక్టర్ కె. హైమావతి సూచనలు

**సిద్దిపేట, జూన్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**: జిల్లాలో ప్రయారిటీ, నాన్-ప్రయారిటీ రంగాల్లో నిర్దేశించిన రుణ లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించేందుకు బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కె. హైమావతి సూచించారు. ఐడీఓసీ సమావేశ మందిరంలో జరిగిన డిస్ట్రిక్ట్ కన్సల్టేషన్ కమిటీ, జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ రుణాలు, ప్రాధాన్యతా రంగ రుణాలు మరింతగా అందించాలని, ప్రభుత్వ సబ్సిడీ పథకాల రుణాలను అర్హులైన లబ్ధిదారులకు జాప్యం లేకుండా మంజూరు చేయాలని ఆదేశించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని బ్యాంకులు రూ.9,450 కోట్ల రుణాలు పంపిణీ చేసి 87.60 శాతం లక్ష్యాన్ని




సాధించాయని తెలిపారు. ఖరీఫ్ సీజన్ దృష్ట్యా రైతు వేదికలు, గ్రామ సభల్లో రుణాలపై అవగాహన కల్పించాలని, ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే రైతులకు సత్వర సేవలు అందించేందుకు హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు విలువ ఆధారిత శిక్షణలు అందించి ఆర్థిక సాధికారతకు కృషి చేయాలని, వ్యవసాయ ఆధారిత ఉత్పత్తుల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని ఆమె పేర్కొన్నారు. సమావేశం అనంతరం 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక రుణ ప్రణాళికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎల్‌డీఎం హరిబాబు మాట్లాడుతూ జిల్లాకు రూ.11,829 కోట్ల వార్షిక రుణ లక్ష్యాలు నిర్ణయించబడినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్‌బీఐ, నాబార్డ్, వివిధ బ్యాంకుల అధికారులు, జిల్లా స్థాయి శాఖల అధికారులు పాల్గొన్నారు. రుణ లక్ష్యాల సాధనకు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ హైమావతి స్పష్టం చేశారు.

# బేటీ బచావో బేటీ పడావో సమీక్ష సమావేశం



**కరీంనగర్, జూన్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో పథకం 2026--27 కార్యాచరణ ప్రణాళికపై సమీక్ష సమావేశం జరిగింది. జిల్లా అధికారి సరస్వతి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి అడిషనల్ కలెక్టర్, నోడల్ అధికారి అశ్విని తనాజ వాకడే అధ్యక్షత వహించారు. బాలికల సంక్షేమం, విద్య కోసం నిధుల వినియోగంపై చర్చిస్తూ, వచ్చే ఏడాదిలో చేపట్టాల్సిన కార్యక్రమాలను సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న అంగన్వాడీ భవనాలు, మరుగుదొడ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ వాటికలు ఏర్పాటు చేసి, పిల్లల నమోదు సంఖ్య పెంచాలని ఆదేశించారు. మిషన్ వాత్సల్య కింద అర్ఫాన్, సెమీ అర్ఫాన్ పిల్లలను గుర్తించి వారికి సహాయం అందించాలని నిర్ణయించారు. సఖి కేంద్రం ద్వారా మహిళలకు అందిస్తున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం అమలులో భాగంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో కమిటీలను ఏర్పాటు చేసి పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు, జిల్లా అధికారులు, సీడీపీవోలు, మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. బాలికల సంక్షేమం, మహిళా సాధికారతకు పథకాల అమలుపై అధికారులు దృష్టి సారించారు.

# దేవరకొండ సిఐ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ

**-శాంతిభద్రతలపై ఎస్పీ శరత్ చంద్ర పవార్ దృష్టి**



**దేవరకొండ, జూన్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ దేవరకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన క్రైమ్ ఫైళ్లు, పెండింగ్ కేసుల రికార్డులు, దర్యాప్తు పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, బాధితులకు సకాలంలో న్యాయం జరిగేలా దర్యాప్తును వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. హత్యలు, దోపిడీలు, మహిళలు--పిల్లలపై నేరాలు, సైబర్ నేరాలకు సంబంధించిన కేసుల పురోగతిని సమీక్షించి, ప్రతి కేసులో బలమైన సాక్ష్యాలను సేకరించి నాణ్యమైన దర్యాప్తు జరిపి నేరస్థులకు తగిన శిక్ష విధించాలన్నారు. అలాగే సీసీటీఎన్ఎస్ నమోదు, డిజిటల్ రికార్డుల నిర్వహణ, కోర్టు కేసుల తదుపరి చర్యలు, వారెంట్ల అమలు వంటి అంశాలను పరిశీలించారు. పోలీసు శాఖపై ప్రజల విశ్వాసాన్ని బలోపేతం చేయడానికి అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన నొక్కి చెప్పారు. శాంతిభద్రతల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేసిన ఎస్పీ, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

# ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణలో బూత్ లెవెల్ ఏజెంట్ల పాత్ర కీలకం

**-ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి కార్యకర్త బాధ్యత వహించాలి**

**--- ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్**


**దేవరకొండ, జూన్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దేవరకొండ నియోజకవర్గంలో బూత్ లెవెల్ ఏజెంట్ల శిక్షణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పాల్గొని, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు



హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా ఏజెంట్లు కృషి చేయాలని సూచించారు. యువత, మహిళలు, గిరిజనులు, దళితులు, మైనారిటీలు మరియు వెనుకబడిన వర్గాల ప్రజలు తప్పనిసరిగా ఓటర్ల జాబితాలో నమోదు కావడానికి సహకరించాలని ఆయన కోరారు. సవరణ ప్రక్రియలో ఎవరైనా అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించబడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి ఇంటికి చేరుకొని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అవసరమైన పత్రాలు సమర్పించడంలో ప్రజలకు సహాయం చేయాలని, బూత్ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల ఓటు హక్కును పరిరక్షించేందుకు కట్టుబడి ఉండాలని ఆయన నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ పార్లమెంటు ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ఇంచార్జ్ ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్, దేవరకొండ అసెంబ్లీ ఇంచార్జ్ ప్రతాప్ రెడ్డి, రాష్ట్ర వడ్డెర సంఘం చైర్మన్ గుంజ రేణుక నారాయణ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, బూత్ లెవెల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

# నూతన జిల్లా వైద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ శ్రీరామ్

**కరీంనగర్, జూన్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారిగా బదిలీపై వచ్చిన డాక్టర్ శ్రీరామ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో మెదక్ జిల్లా వైద్యాధికారిగా పనిచేసిన ఆయన, ఉమ్మడి వరంగల్, మెహబూబాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి జిల్లాల్లో కూడా సేవలందించారు. ప్రజారోగ్య కార్యక్రమాల అమలు, పరిపాలనా నిర్వహణలో విశేష అనుభవం కలిగిన ఆయన, కరీంనగర్ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఇప్పటివరకు జిల్లా వైద్యాధికారిగా పనిచేసిన డాక్టర్ వెంకటరమణ వరంగల్ క్షయవ్యాధి ఆసుపత్రికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో డాక్టర్ శ్రీరామ్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ అధికారులు, సిబ్బంది, వైద్యాధికారులు, సూపర్‌వైజరీ సిబ్బంది మరియు ఇతర ఉద్యోగులు డాక్టర్ శ్రీరామ్‌కు స్వాగతం పలికారు. జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తన లక్ష్యమని డాక్టర్ శ్రీరామ్ స్పష్టం చేశారు.



## జూన్ 10న బి ఎల్ ఏ-2 సభ్యుల శిక్షణా తరగతులు నిర్వహణ



**కరీంనగర్, జూన్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బి ఎల్ ఏ-2 సభ్యుల కోసం శిక్షణా తరగతులు జూన్ 10న ఉదయం 10 గంటలకు కెమిస్ట్రీ భవన్‌లో జరుగనున్నాయి. ఈ శిక్షణలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, బి ఎల్ ఏ-2 సభ్యుల విధులు, బాధ్యతలు, ఓటర్ల జాబితా పరిశీలన, ఫారం-6, ఫారం-7, ఫారం-8లకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించనున్నారు. అన్ని డివిజన్ల బి ఎల్ ఏ-2 సభ్యులు తప్పనిసరిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు నమిండ్ల శ్రీనివాస్ పరిశీలకుడిగా హాజరుకానున్నారు. జూన్ 10న బి ఎల్ ఏ-2 సభ్యుల శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ ప్రకటించింది.

## పలు ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేసిన వ్యవసాయ అధికారులు



**హుస్నాబాద్, జూన్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

మండల వ్యవసాయ అధికారి వేల్పుల పూజ, ఎస్సై పాకాల లక్ష్మారెడ్డి ఆకస్మికంగా పలు ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీలర్లకు నాణ్యమైన సన్నరక వడ్ల విత్తనాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు విక్రయించినా లేదా అధిక ధరలకు అమ్మినా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు కొనుగోలు చేసే ప్రతి వస్తువుకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని, ప్రతి షాపులో స్టాక్ బోర్డులు స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులు స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే డీలర్లపై లైసెన్సులు రద్దు చేస్తామని అధికారులు హెచ్చరించారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛ పాఠశాల కార్యక్రమం నిర్వహణ



**కరీంనగర్, జూన్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా వినూత్న కార్యక్రమాలు చేపట్టనున్నట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. జూన్ 15న పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, జూన్ 13న పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో గల అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛ పాఠశాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా క్లాస్‌రూమ్‌ల శుభ్రత, సుందరీకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల టెన్త్ విద్యార్థులకు 'మోదీ గిఫ్ట్' కింద ఉచితంగా బ్రాండెడ్ సైకిళ్లు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈసారి ఒకే సమయంలో వేలాది సైకిళ్లను పంపిణీ చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. మోదీ పాలన 12 ఏళ్ల పూర్తి సందర్భంగా బుధవారం ఉదయం కరీంనగర్ మహాశక్తి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జూన్ 13న స్వచ్ఛ పాఠశాల కార్యక్రమం, టెన్త్ విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ జరగనుంది.

## వైద్యులకు భద్రత కల్పించాలని ఐఎంఏ డిమాండ్




**కరీంనగర్, జూన్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ బి.ఎన్.రావుపై జరిగిన దాడి యత్నాన్ని ఐఎంఏ, తెలంగాణ ప్రైవేటు నర్సింగ్ హోంల సంఘం తీవ్రంగా ఖండించాయి. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని వైద్యులకు తగిన రక్షణ కల్పించాలని ప్రభుత్వం, పోలీసులను వారు కోరారు. ఈ సమస్యపై ఐఎంఏ ఒక యాక్షన్ కమిటీని ఏర్పాటు చేసి, కరీంనగర్ సీపీ గౌష్ ఆలంకు వినతిపత్రం అందజేసినట్లు ప్రతినిధులు తెలిపారు. వైద్యుల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని ఐఎంఏ పట్టుదలగా డిమాండ్ చేసింది.

## ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించడమే లక్ష్యం

**- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**



**కరీంనగర్, జూన్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

చొప్పదండి నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ అధికారులకు ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం సూచించారు. గత ప్రభుత్వం ప్రజా రవాణా వ్యవస్థను నిర్వీర్యం చేసిందని విమర్శిస్తూ, ఇప్పుడు ప్రతి గ్రామానికి బస్సులు నడిపి రవాణా వ్యవస్థను పటిష్టం చేయాలని ఆయన అన్నారు. ఎమ్మెల్యే సత్యం పలు కీలక సూచనలు చేశారు. కెనాల్‌ల వద్ద ప్రమాదాలు నివారించేందుకు అల్యూమినియం సేఫ్టీ వాల్స్ నిర్మించాలని, నిలిపివేసిన మోడల్ స్కూల్ బస్సులు, నైట్ హాల్ట్ సర్వీసులను పునరుద్ధరించాలని, కొత్త బస్ స్టాప్‌లు ఏర్పాటు చేసి తాగునీరు, టాయిలెట్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. విద్యార్థుల సౌకర్యార్థం స్కూళ్లు, కాలేజీల సమయాల్లో తప్పనిసరిగా బస్సులు నడపాలని ఆదేశించారు. అదేవిధంగా ఆయన ప్రతిపాదనల మేరకు జగిత్యాల, వేములవాడ, కరీంనగర్, గంగాధర, పుదూర్ ప్రాంతాల నుంచి పలు మార్గాల్లో 14 కొత్త బస్సు రూట్లు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ రూట్లలో త్వరలోనే బస్సులు నడిపి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించనున్నట్లు ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. ఈ సమావేశంలో రీజనల్ మేనేజర్ బి. రాజు, డిప్యూటీ రీజనల్ ఆఫీసర్ భూపతిరెడ్డి, కరీంనగర్ 1 డిపో మేనేజర్ విజయ మాధురి పాల్గొన్నారు. ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించడమే లక్ష్యమని ఎమ్మెల్యే సత్యం స్పష్టం చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే వార్డు సభ ప్రధాన లక్ష్యం



**జమ్మికుంట, జూన్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

: ప్రజాపాలన ప్రగతి కార్యక్రమంలో భాగంగా జమ్మికుంట మున్సిపాలిటీ 18వ వార్డులో వార్డు సభ నిర్వహించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని తడి చెత్త, పొడి చెత్త నిర్వహణ, లోతట్టు ప్రాంతాల్లో సమస్యలు, పారిశుద్ధ్య అంశాలపై చర్చ జరిగింది. ప్రజలు పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్ల పథకం, డ్రైనేజీ, వీధి దీపాలు, తాగునీటి సరఫరా వంటి సమస్యలను సభలో ప్రస్తావించారు. వార్డు కౌన్సిలర్ కూతాటి తిరుపతి ప్రజలు తెలిపిన సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ దేశిని కోటి--స్వప్న, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరి రమేష్, వార్డు ఆఫీసర్ రామరాజు, వార్డు సిబ్బంది మారుతి, అంగన్వాడీ టీచర్ రమాదేవి, ఏఎన్ఎం వాణి, డాక్వా ఆర్పీ సరిత, ఆశా వర్కర్ సుజాతతో పాటు వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే సభల ప్రధాన లక్ష్యమని అధికారులు స్పష్టం చేశారు.


## సాంకేతికత వినియోగం, భద్రతా ప్రమాణాల అమలుపై సీపీ గౌష్ ఆలం కీలక ఆదేశాలు



**కరీంనగర్, జూన్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

వార్షిక తనిఖీల్లో భాగంగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మంగళవారం హుజురాబాద్ ఏసీపీ కార్యాలయాన్ని సందర్శించారు. సాయుధ బలగాలు గౌరవ వందనం సమర్పించగా, ఆయన కార్యాలయ ప్రాంగణంలో మొక్కను నాటారు. అనంతరం పెండింగ్ కేసులు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. సీపీ మాట్లాడుతూ జూన్ 15లోగా సీసీటీఎన్ఎస్ 2.0, ఈ-సాక్ష్య యాప్‌లలో కేసుల వివరాలను తప్పనిసరిగా పొందుపరచాలని ఆదేశించారు. నగల దుకాణాలు, బ్యాంకులు, లాడ్జీలలో భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టం చేయాలని, లోపాలు ఉన్న యాజమాన్యాలకు ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. వలస కార్మికుల వివరాలు, పాత నేరస్థులపై నిఘా, కార్డన్ అండ్ సెర్చ్ తనిఖీలు ముమ్మరం చేస్తున్నామని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రత్యేక పోలీస్ డాగ్స్ సహాయంతో తనిఖీలు నిర్వహిస్తున్నామని, పట్టుబడినవారిపై ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళల రక్షణ కోసం షీ టీమ్స్, స్నేహిత కార్యక్రమాలకు పెద్దపీట వేస్తున్నామని, నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరాలను పునరుద్ధరిస్తున్నామని తెలిపారు. హుజురాబాద్ సబ్ డివిజన్ పోలీసుల పనితీరుపై సంతోషం వ్యక్తం చేస్తూ భేష్ అని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ మాధవి, ఇన్స్పెక్టర్లు కరుణాకర్, రామకృష్ణ, వెంకట్, శ్రీనివాస్, ఎస్సైలు స్వాతి, ఆవుల తిరుపతి, ఇతర అధికారులు పాల్గొన్నారు. సాంకేతికత వినియోగం, భద్రతా ప్రమాణాల అమలు, నేరాల నియంత్రణపై సీపీ గౌష్ ఆలం కీలక ఆదేశాలు జారీ చేశారు.

## కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు



**కరీంనగర్, జూన్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

డబుల్ బెడ్‌రూమ్, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలు ఎదుట హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. ప్రజలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు హెల్ప్ డెస్క్‌లో సంప్రదించి తమ సమస్యలను తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో సుధాకర్, గృహనిర్మాణ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఇళ్ల సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు.

## ప్రైవేట్ స్కూళ్లు, ఆసుపత్రుల ఫీజుల దోపిడిని అరికట్టాలని సిపిఎం డిమాండ్



**కరీంనగర్, జూన్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ప్రైవేట్ ఆసుపత్రులు, పాఠశాలలు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నాయని సిపిఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం తీవ్రంగా విమర్శించారు. ఆసుపత్రులు అవసరం లేకపోయినా సిటి స్కాన్, ల్యాబ్ పరీక్షల పేరిట వేల రూపాయలు వసూలు చేస్తున్నాయని, పేషంట్ల ఆర్థిక పరిస్థితిని తెలుసుకొని లక్షల రూపాయలు దండుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ప్రైవేట్ విద్యాసంస్థలు ఎల్కేజీ, యూకేజీ నుంచే లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేస్తూ, పుస్తకాలు, యూనిఫారాలు యాజమాన్యాల తయారీ ద్వారా అక్రమంగా లాభాలు పొందుతున్నాయని పేర్కొన్నారు. ఫీజుల దోపిడిని అరికట్టేందుకు పటిష్ట చట్టం అవసరమని, సిపిఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు, పాఠశాలలను సందర్శించి అక్రమాలు బయటపెడతామని, అవసరమైతే ఆందోళన పోరాటాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ, రానున్న మూడు నెలల పాటు ప్రజా సమస్యలపై క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు సిపిఎం నగర కమిటీ ప్రకటించింది. ప్రైవేట్ స్కూళ్లు, ఆసుపత్రుల ఫీజుల దోపిడిని అరికట్టాలని సిపిఎం పట్టుదలగా డిమాండ్ చేసింది.

## ఘనంగా ఎల్లమ్మ బోనాల ఉత్సవాలు



**కరీంనగర్, జూన్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

నగరపాలక సంస్థ పరిధిలోని దుర్శేడ్ శివారులో ఎల్లమ్మ దేవాలయంలో జరిగిన బోనాల ఉత్సవాల్లో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. మేయర్ శ్రీనివాస్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, మల్లన్న దేవాలయం నుండి ఎల్లమ్మ దేవాలయం వరకు ఏర్పాటు చేసిన నూతన స్ట్రీట్ లైట్లను ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే నగరపాలక సంస్థ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి ఎల్లమ్మ అమ్మవారి దర్శనం అనంతరం రాబోయే వర్షాకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా ముందుకు సాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ భూపతి రవీందర్, సాయిని తిరుపతి, బుర్ర హరీష్ గౌడ్, పాలకుర్తి లక్ష్మణ్ గౌడ్, మురళి కృష్ణ, భూమయ్య గౌడ్, సంపత్ గౌడ్, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఎల్లమ్మ బోనాలలో మేయర్, సుడా చైర్మన్ పాల్గొని ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రార్థనలు చేశారు.

## మద్యం సేవించి వాహనం నడిపిన వారిపై కఠిన చర్యలు

**కరీంనగర్, జూన్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

: పెద్దపల్లి జిల్లా గోదావరిఖని కి చెందిన పర్ష శరత్‌కుమార్ మద్యం సేవించి వాహనం నడుపుతుండగా కరీంనగర్ రూరల్ పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డాడు. నిందితుడిని మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, జడ్జి ఆరు రోజుల జైలు శిక్ష విధించారు. ఈ విషయాన్ని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి వెల్లడించారు. మద్యం సేవించి వాహనం నడిపిన వారికి కఠిన శిక్షలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

## కల్తీ కారంపొడి విక్రయిస్తున్న దుకాణాలపై టాస్క్ ఫోర్స్ దాడులు



**కరీంనగర్, జూన్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** :నగరంలోని శనివారం మార్కెట్ పరిధిలో కల్తీ కారంపొడి విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. గౌరిశెట్టి రమేష్, సిద్ధంశెట్టి చక్రపాణి దుకాణాల్లో భారీగా నిల్వ ఉంచిన అనుమానాస్పద కారంపొడి, పసుపు, ధనియాల పొడిని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 47 బస్తాల కారంపొడి, 2 బస్తాల పసుపు, 1 బస్తా ధనియాల పొడి ఫుడ్ సేఫ్టీ అధికారుల సమక్షంలో సీజ్ చేశారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు నమూనాలను సేకరించి ల్యాబ్ పరీక్షలకు పంపించారు. ఫలితాలు వచ్చే వరకు నిల్వను పూర్తిగా సీజ్ చేసి, విక్రయాలపై నిషేధం విధించారు. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడే కల్తీ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఈ దాడుల్లో టాస్క్ ఫోర్స్ ఏసీపీ వాసాల సతీష్, ఎస్సైలు మామిడాల సురేందర్, శ్రీకాంత్, కానిస్టేబుల్ సాయిదీప్ పాల్గొన్నారు. కల్తీ కారంపొడి, సుగంధ ద్రవ్యాలపై టాస్క్ ఫోర్స్ భారీగా స్వాధీనం చేసింది.

## పర్యావరణ పరిరక్షణలో స్థానిక ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకం




**పెద్దపల్లి, జూన్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, అటవీ ఉత్పత్తుల వినియోగంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అంతర్గాం మండలం కుందనపల్లి గ్రామంలోని అర్బన్ ఫారెస్ట్ పార్కులో గ్రామస్తులకు చీపురు గడ్డి, తేనె, ఇప్ప పూలు వంటి అటవీ ఉత్పత్తుల విలువ ఆధారిత వినియోగంపై శిక్షణ ఇచ్చారు. వర్మీ కంపోస్ట్ తయారీ పద్ధతులపై కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 62 మంది గ్రామస్తులు పాల్గొన్నారు. మంథని మండలం ఖాన్సాపేట్ గ్రామంలో కూడా అటవీ ఉత్పత్తుల సేకరణ, వర్మీ కంపోస్ట్ తయారీపై అవగాహన కల్పించారు. ఈ సమావేశానికి సర్పంచ్, ఉప సర్పంచ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 38 మంది గ్రామస్తులు పాల్గొన్నారు. అటవీ అధికారులు మాట్లాడుతూ అడవులపై ఆధారపడి జీవించే ప్రజలు శాస్త్రీయ పద్ధతులను అనుసరించి పర్యావరణానికి హాని కలగకుండా ఉత్పత్తులను సేకరించాలని సూచించారు. వర్మీ కంపోస్ట్ వంటి సేంద్రీయ ఎరువుల తయారీ ద్వారా అదనపు ఆదాయం పొందే మార్గాలను అన్వేషించాలని ప్రోత్సహించారు. పర్యావరణ పరిరక్షణలో స్థానిక ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని అధికారులు స్పష్టం చేశారు.


## ప్రజా సమస్యలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

**- మాజీ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి**



**పెద్దపల్లి, జూన్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ మాజీ మంత్రి హరీష్‌రావుపై తప్పుగా వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. ఆరు గ్యారంటీలు ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు మహిళలకు రూ.2,500 ఇవ్వలేదని, తులం బంగారం వాగ్దానం కూడా మర్చిపోయిందని విమర్శించారు. రైతు బంధు, రైతు బీమా పథకాలను కాంగ్రెస్ ఎగనామం పెట్టిందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల భూగర్భ జలాలు పెరిగి బోర్లు, బావుల్లో నీటి మట్టం పెరిగిందని గుర్తుచేశారు. కొనుగోలు కేంద్రాల్లో వడ్లు, మక్కలు కొనుగోలులో లారీలు, బరువుల సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, అధిక తూకం వేస్తూ రైతులను మోసం చేస్తున్నారని అన్నారు. డిస్కాం విధానాల వల్ల రైతులకు నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం వల్ల అన్ని వర్గాలు అవస్థలు పడుతున్నాయని, రాబోయే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పి మళ్లీ బీఆర్ఎస్ పార్టీకి పట్టం కడతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను విస్మరించిన కాంగ్రెస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్తారని బీఆర్ఎస్ నేతలు వ్యాఖ్యానించారు.

# సుల్తానాపూర్ సర్పంచ్ బాపయ్యకు ఘన సత్కారం



సుల్తానాపూర్ సర్పంచ్ బాపయ్య ను సన్మానిస్తున్న దళిత సంఘ నాయకులు

**ఎలిగేడు, జూన్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎలిగేడు మండలంలోని సుల్తానాపూర్ గ్రామ పంచాయతీ రాష్ట్రస్థాయి ఉత్తమ పర్యావరణ పనితీరు అవార్డు--2026ను అందుకుంది. ఈ అవార్డును ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా సర్పంచ్ కవ్వంపల్లి బాపయ్య స్వీకరించారు. ఈ విజయాన్ని పురస్కరించుకుని దళిత సంఘాల ప్రజాప్రతినిధులు, నాయకులు గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బాపయ్యను ఘనంగా శాలువాతో సన్మానించి సత్కరించారు. వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణలో పంచాయతీ చేసిన విశిష్ట సేవలకు ఈ అవార్డు లభించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని సిపిఎం డిమాండ్



**అచ్చంపేట, జూన్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలో పనిచేస్తున్న ప్రతి జర్నలిస్టుకు ప్రభుత్వం ఇండ్ల స్థలాలు కేటాయించాలని సిపిఎం మండల కార్యదర్శి వర్ధ సైదులు డిమాండ్ చేశారు. జర్నలిస్టులు ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా ప్రజలకు సంక్షేమ పథకాలను చేరవేస్తున్నారని, ఎలాంటి గౌరవ వేతనం లేకుండా సామాజిక బాధ్యతతో పనిచేస్తున్నారని ఆయన గుర్తు చేశారు. గత ప్రభుత్వాలు పదేళ్లుగా ఇళ్ల స్థలాల వాగ్దానం చేసి అమలు చేయలేదని, జర్నలిస్టులు 14 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాన్ని తక్షణమే అమలు చేసి జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. జర్నలిస్టుల కోసం ఇళ్ల స్థలాల వాగ్దానాన్ని అమలు చేయాలని సిపిఎం పట్టుదలగా డిమాండ్ చేసింది.

# స్వగ్రామానికి సేవలందించడం అభినందనీయం

**-ఎస్పీ శరత్ చంద్ర పవార్**




**దేవరకొండ జూన్.09 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** నల్గొండ జిల్లా, దేవరకొండ మండలం,కొండభీమనపల్లి గ్రామంలో ఎం.వి.ఆర్ ఫౌండేషన్ (మాజీ సర్పంచ్ ఎమ్.విద్యావతి వెంకట్ రెడ్డి దంపతులు) మరియు ఎన్నారై ఎమ్. తిరుపతమ్మ ఆర్థిక సౌజన్యంతో, లయన్స్ క్లబ్ మరియు శంకర్ నేత్రాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.

ఈ శిబిరానికి నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ముఖ్య అతిథిగా హాజరై, చికిత్స పొందిన బాధితులకు ఉచితంగా కళ్లజోళ్లను పంపిణీ చేశారు. పుట్టిన ఊరికి ఇలాంటి సేవలు అందించడం అభినందనీయమని ఆయన కొనియాడారు.

శిబిరం ముఖ్యాంశాలు:

మొత్తం పరీక్షలు: 2,724 మందికి

ఆపరేషన్లు పూర్తి చేసుకున్న వారు: 161 మంది

కంటి సమస్యలు (కాటరాక్ట్): 121 మంది

షుగర్ వ్యాధి సమస్యలు: 16 మంది

ఇతర సమస్యలు: 76 మంది

ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ వెంకట్ రెడ్డి, స్థానిక సర్పంచ్ కే. శ్రీను,ఎన్నారై తిరుమలరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ప్రముఖ వక్త వర్ల కృష్ణ మోహన్ మరియు శంకర్ నేత్రాలయం కోఆర్డినేటర్ భానుప్రకాష్ వైద్య బృందం పాల్గొన్నారు. ఉచిత వైద్య సేవలు అందినందుకు గ్రామస్తులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎలిగేడులో వైభవంగా ఎల్లమ్మ బోనాలు



బోనాలతో గౌడ సంఘం మహిళలు

**-గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహణ**

**ఎలిగేడు, జూన్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గౌడ కులస్థుల ఆరాధ్యదైవమైన శ్రీ రేణుక--ఎల్లమ్మ తల్లి బోనాలు ఎలిగేడు మండల కేంద్రంలో మంగళవారం అత్యంత వైభవంగా జరిగాయి. గ్రామంలోని దాదాపు 40 గౌడ కుటుంబాల నుండి ఇంటికో బోనం చొప్పున మహిళలు బైండ్లపూజారుల డప్పు చప్పుళ్ల మధ్య బోనాలను తలపై ఎత్తుకుని గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయానికి తరలివెళ్లారు. ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేసి, అమ్మవారికి సమర్పించి, టెంకాయలు కొట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ ఉత్సవంలో వేగోళం నాగరాజు గౌడ్, పురుషోత్తం అజయ్ గౌడ్, అడ్డగుంట కొమురవెల్లి గౌడ్, ప్రదీప్ గౌడ్, బుర్ర శ్రీనివాస్ గౌడ్తో పాటు గౌడ సంఘం కులస్థులు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



బోనమెత్తుకున్న నారాయణ పల్లి సర్పంచ్ రంగు లత శ్రీనివాస్ గౌడ్

# డ్రోన్ల ఎగరవేతపై నిషేధం

**హైదరాబాద్, జూన్ 9 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి నేడు మీర్‌ఖాన్‌పేట్ పర్యటన సందర్భంగా భద్రతా కారణాల దృష్ట్యా ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి, ఐపీఎస్ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. భారతీయ నాగరిక సురక్షా సంహిత సెక్షన్ 163 ప్రకారం, హైదరాబాద్ గ్రీన్ ఫార్మా సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రోన్లు, పారా గ్లైడర్లు, రిమోట్ కంట్రోల్ మైక్రో--లైట్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల ఎగరవేతను నేడుపూర్తిగా నిషేధించారు. ఈ నిర్ణయం కేంద్ర హోంశాఖ భద్రతా మార్గదర్శకాలు, నిఘా సంస్థల సమాచారాన్ని ఆధారంగా తీసుకుని అమలు చేయబడింది. సంఘవిద్రోహ, ఉగ్రవాద శక్తులు డ్రోన్లను దుర్వినియోగం చేసే అవకాశం ఉన్నందున ప్రజా భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఈ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ నిషేధాన్ని ఉల్లంఘించిన వ్యక్తులు లేదా సంస్థలపై సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని పోలీసులు హెచ్చరించారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు స్థానిక పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రచారం చేయడంతో పాటు పోలీస్ స్టేషన్లు, కార్యాలయాల నోటీస్ బోర్డులపై ఉత్తర్వులు ప్రదర్శించబడతాయి. ఫ్యూచర్ సిటీ పోలీసులు ప్రజలు, డ్రోన్ ఆపరేటర్లు, ఫోటోగ్రాఫర్లు, ఈవెంట్ నిర్వాహకులు, మీడియా ప్రతినిధులు ఈ నిషేధాన్ని గౌరవించి, ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా, శాంతియుతంగా సాగేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

